# అయినా నాకెందుకులే

## దేవుడులేడో మరి?

మన్నెం శారద



వెంకట్రావు ఈ మధ్య ఎప్పుడు చూసినా దేవాలయాల్లోనే కనిపిస్తున్నాడు. ఎప్పుడు చూసినా ఏ ఏడు కొండవాడికో, సింహాచలం అప్పన్నకో తలనీలాలు సమర్పించుకున్నానని చెప్పి శుభ్రంగా చలివిడి ముద్దలాంటి గుండేసుకు తిరుగుతున్నాడు.

పరమ నాస్తికుడైన వెంకట్రావు అపర భక్తుడయిపోవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఇంతకీ వెంకట్రావు అలా భక్తకన్నప్పలా అయిన కారణం బెట్టిదనిన—

ఒక రోజు వెంకట్రావు ఆఫీస్ నుండి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు. ఇంత ఆలస్యమైందేమిటని మూతి తిప్పుకున్న భార్యామణికి "అలా ఫ్రెండ్స్‌తో సినిమాకి వెళ్ళి అలాగే హోటల్‌కెళ్ళి భోంచేశానోయ్. నువ్వింకా భోం చేయలేదా?" అన్నాడు నవ్వుతూ. సదరు భార్యామణికి కోపం వచ్చి గోడకేసి తిరిగి పడుకుంది.

సరిగ్గా గంట తర్వాత అసలు కథ ప్రారంభమైంది. అతగాడు కడుపు నొప్పితో మెలికలు తిరగడం ప్రారంభించాడు. ఆ వెంటనే వాంతులు. ఆవిడ కోపాన్ని తీసి దిండు కింద పెట్టి కంగారు పడటం ప్రారంభించింది.

"ఆ పాడు హోటల్లో ఏం తిన్నారో! అరిగలేదు" అంటూ వాము రసం ఇచ్చింది. ఉప్పు కాపడం పెట్టింది. అయినా లాభం లేదు. వెంకట్రావు నొప్పితో సతమతమయిపోతున్నాడు.

చివరికి ఇది పని కానట్టు ఇరుగు పొరుగును లేపి సలహాలు అడిగింది. ఎవరికి తోచింది వాళ్ళు చెప్పారు. ఆ మర్నాడు ఇంటి దగ్గరే ఉన్న ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌కి వెంకట్రావుని తీసుకెళ్ళారు. ఆ రోజు ఏదో పండుగ కావడంతో ఒక్క డాక్టరమ్మ పేషంట్లందరితో కుస్తీ పడుతుంది. ఆవిడ వెంకట్రావుని పరిశీలించి ఏవో మందులు రాసి ఇచ్చింది. ఆ మందులు వేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఆ తెల్లవారి వెంకట్రావు పెద్ద కేక పెట్టి స్పృహ తప్పిపోయేడు.

వెంటనే అతడిని ఇంటి పక్కనే వున్న పెద్ద హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. అక్కడ వాళ్ళు గంటన్నర కాలాన్ని మింగి— "ఇది ఎపెండిసైటిస్. మా కేసు కాదు. ఊరు చివర ఆస్పత్రికి తీసుకుని వెళ్ళండి" అన్నారు.

వెంకట్రావు వెనుక ఉన్న జనం అతన్ని ఆటోలో వేసుకుని ఆ ఆస్పత్రికి ప్రయాణం అయ్యారు. ఆటో గతుకుల్లో హై జంప్‌లు చేస్తూ వెళుతుంటే వెంకట్రావుకి అప్పుడే కొద్దిగా దేవుళ్ళు కనబడటం ప్రారంభించారు. అయినా అంత బాధలోనూ 'దేవుడు లేడు గీవుడు లేడు' అంటూ లెంపలు వాయించుకుని కళ్ళు మూసుకున్నాడు. ఆటో ట్రాఫిక్ ఐలాండ్స్ దగ్గర ఆగుతూ సాగుతూ పెళ్ళి ఊరేగింపులా హాస్పిటల్ చేరేసరికి మరో రెండు గంటల కాలం హరించిపోయింది.

ఇద్దరు హౌస్ సర్జన్లు జోగుతూ వచ్చి వెంకట్రావుని పరిశీలించి ఎమర్జెన్సీ వార్డ్‌లో పడుకోబెట్టి సెలైన్ పెట్టారు.

అప్పటికి వెంకట్రావుకి నొప్పి ప్రారంభమయి ముప్పయి గంటలు దాటింది. వెంకట్రావు భార్య కాస్త చదువుకుంది. ఎపెండిసైటిస్‌కి ఇరవై నాలుగు గంటల్లో ఆపరేషను జరగాలన్న విషయం ఆమెకు తెలుసు. కాని హాస్పిటల్లో జేరి నాలుగు గంటలు దాటినా ఎవరూ ఆ సంగతే ఎత్తడంలేదు. ఆవిడ వణికిపోతూ అక్కడే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న హౌస్ సర్జన్స్ దగ్గరకి పరుగెత్తుకెళ్ళి— "ఆయనదోలా అయిపోతున్నారు. ఆపరేషను ఎప్పుడు చేస్తారు?" అని అడిగింది.

వాళ్ళు ఆవిడ కంగారు చూసి పట్టించుకోలేదు.

"అనస్తీషియా ఇచ్చే డాక్టరు ఒకరు సెలవు పెట్టారు. రెండో డాక్టరు ఎంతమందికని ఇస్తాడు? కాసేపు ఆగాలి. సాయంత్రం ఏడు గంటలకి ఆపరేషను చేస్తాం" అన్నారు.

ఆమెకి మతిపోయింది.

"ఇంత ఊరంత హాస్పిటల్‌కి ఇద్దరేనా అనస్తీషియా ఇచ్చే వాళ్ళు! ఇరవై నాలుగుగంటల్లో ఆపరేషను జరగాలని మీకు తెలియదా?" అంది కొంచెం ఆవేశపడుతూ.

వాళ్ళు మాత్రం చిదానంద స్వామి భక్తుల్లా చిద్విలాసంగా నవ్వుతూ— "అయితే ఇప్పుడే అంటావమ్మా? ఇంటి దగ్గర మీరు ఆలస్యం చేస్తే ఫర్వాలేదా?" అన్నాడు వెటకారంగా.

ఆవిడకి వెంటనే ఏం జవాబూ చెప్పలేకపోయింది. కళ్ళ వెంబడి నీళ్ళొచ్చాయి.

"నిజమే—మేం తెలియక ఆలస్యం చేశాం. మీరు వైద్య వృత్తి

చేస్తూ అన్నీ తెలిసి అలస్యం చేస్తున్నారు. ఆయనకేమైనా అయితే మీరు జవాబుదారీ అవుతారా?'' అంది కోపంగా.

వాళ్ళు ఆవిడ వైపు కొద్దిగా ఆశ్చర్యంగా చూసి మళ్ళీ వాళ్ళ కబుర్లలో పడిపోయారు, అలా చలించిపోతే మేం ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేయడానికే పనికి రామన్నట్లుగా.

ఆవిడకి వెంకట్రావు స్థితి చూస్తుంటే మతి చలించిపోతోంది. ఇక దేవుడి మీద భారం వేసి అలాగే కూర్చుంది నిస్సహాయంగా.

చివరికి ఆరు గంటలకి వెంకట్రావుకి ఆపరేషను జరిగింది.

ఆపరేషను అయిన వెంటనే వెంకట్రావు ఉన్న స్ట్రెచర్‌ని హాల్లోకి నెట్టేశారు. అతను స్పృహ రాకుండానే 'చలి చలి'' అంటూ స్ట్రెచర్ మీదనుండి మూడు అడుగుల ఎత్తు ఎగిరిపడుతున్నాడు. వెంకట్రావు బంధువర్గం డాక్టర్ కోసం పరుగెత్తారు. కాని.... ఎవరూ వెంకట్రావు సంగతి పట్టించుకోలేదు.

వెంకట్రావు ఊపిరి అందడం లేదని కూడా అరుస్తున్నాడు. కాని వినే నాధుడెవరూ లేరక్కడ.

'వెంకట్రావు బంధువర్గం అటూ ఇటూ పరిగెత్తి చివరికి ఒక ఆయాని పది రూపాయలిచ్చి తీసుకొచ్చారు. ఆవిడ స్ట్రెచర్‌ని ఆస్పత్రిలో ఉన్న స్థంభాలన్నిటికీ దఢాలున బాదుతూ మెల్లిగా ఆసుపత్రి బయట ఉన్న అంబులెన్స్ దగ్గరకి తీసుకొచ్చి పది రూపాయలు జాకెట్లో పెట్టుకుని నైస్‌గా వెళ్ళిపోయింది.

అక్కడే కూర్చొని కబుర్లు చెప్పుకొంటున్న ఆయాలు అలాగే చూస్తున్నారు. వెంకట్రావు భార్య వాళ్ళని భర్తను అంబులెన్స్ ఎక్కించమని అడిగినా వినిపించుకోలేదు. చివరికి ఆమె ఇక లాభం లేదని ఒక పది రూపాయల నోటుని కింద పడేసింది.

వెంటనే ఒక ఆయా లేచి వచ్చి వెంకట్రావు తల పట్టుకుంది. మరో వైపు వెంకట్రావు భార్య. ఎట్టకేలకి వెంకట్రావు పోస్ట్ ఆపరేషను థియేటర్ చేరుకున్నాడు. అక్కడ మేల్ నర్స్ ఆమె దగ్గర యాభై రూపాయల నోటు అందుకుని ఆమెని బయటికి పొమ్మన్నాడు. ''డెబ్బయి రెండు గంటలు మీరెవరూ రాకూడదు! అంతా మేం చూసుకుంటాం'' అని తలుపులేశారు.

వెంకట్రావుకి స్పృహ వచ్చింది. ''దాహం! దాహం!'' అన్నాడు.

జవాబు లేదు.

''బెడ్ పాన్! బెడ్ పాన్!'' అన్నాడు.

సమాధానం లేదు.

''నిద్రపట్టడంలేదు''అన్నాడు.

పట్టించుకోలేదు.

అయినా వెంకట్రావు బతికి బట్ట కట్టాడు.

డెబ్బయి రెండు గంటల తరువాత వెంకట్రావు తాలూకా వాళ్ళెవరూ రాకుండానే వాళ్ళ ఆసుపత్రి బట్టలు ఊడబీక్కుని ఓ రగ్గు కప్పి జనరల్ వార్డులో పడేశారు వెంకట్రావుని.

ఇక వెంకట్రావు ముఖం చూసిన వాళ్ళు లేరు.

వెంకట్రావు భార్య వచ్చేవరకు నోరెండిపోతున్నా, ఆ మురికిలో వాసన భరిస్తూ అలాగే పడి ఉన్నాడు.

అప్పుడు వెంకట్రావు కళ్ళు చీకటయ్యాయి. ఆ చీకట్లో ఒక మెరుపు

అప్పుడే అతనికి జ్ఞానోదయం అయింది.

''దేవుడున్నాడు'' అని లంప లేసుకున్నాడు.

''దేవుడే లేకపోతే ప్రభుత్వ ఆసుపత్రికెళ్ళి ఎలా బతికేనంటారు?'' అని సవాల్ కూడా చేస్తాడు.

అందుకే దేవుడున్నాడు మరి!

*

